క్లుప్తంగా

లాలాపేట ఎస్‌హెచ్‌ఓగా శ్రీనివాసరావు



పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ డివిజన్ పరిధిలోని లాలాపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా ఎం.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన శ్రీనివాసరావు ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. 2020 సంవత్సరంలో సీఐగా పదోన్నతి లభించిన శ్రీనివాసరావు ఒంగోలుతోపాటు పలు ప్రాంతాల్లో పని చేశారు. అనంతరం ఈస్ట్ ట్రాఫిక్ సీఐగా గత మూడు నెలల క్రితం నియమితులయ్యారు. ఈనేపథ్యంలో లాలాపేట పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు అప్పజెబుతూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

ట్రాఫిక్ సీఐగా కోటేశ్వరరావు



పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సీఐగా బి.కోటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్ ఎస్సైగా పోలీసు విధుల్లోకి వచ్చిన ఆయన గుంటూరుతోపాటు పలు ప్రాంతాల్లో పని చేశారు. అనంతరం 2012లో ఆయనకు సీఐగా పదోన్నతి లభించింది. సీఐగా గురజాల, సత్తెనపల్లి, నరసరావుపేట, గుంటూరు నగరంపాలెం, తెనాలి-2 టౌన్ పోలీసు స్టేషన్ సీఐగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న కోటేశ్వరరావును ట్రాఫిక్ సీఐగా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

డీఎంహెచ్‌ఓకు వైద్య పరీక్షలు

గుంటూరు మెడికల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం 51వ డివిజన్‌లో గుంటూరు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు కుటుంబ సభ్యులకు వైద్యులు, వైద్య సిబ్బంది పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు కుమారి, కాళికాంబ, 145 సచివాలయం కన్వీనర్ వెంకట్రావు, పెంటయ్య, శేషుకుమారి, శ్రీనివాసరావు, ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

కరాటే టోర్నమెంట్‌లో సత్తా చాటిన విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్‌గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం జరిగిన మాస్టర్ అసాయి మెమోరియల్ 2వ అంతర్జాతీయ కరాటే పోటీల్లో హిడెన్‌స్పార్క్స్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల డైరెక్టర్ ఎస్. శ్యామల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-8 విభాగంలో జాహ్నవి, జాయ్ విన్నీ ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు. అండర్-10 బాలికల విభాగంలో షణ్ముఖి తృతీయ, బాలుర విభాగంలో రుషిక్‌రెడ్డి, పవన్ శ్రీకర్ రెడ్డి, సాయి మానీష్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు వివరించారు. అదే విధంగా అండర్-12 విభాగంలో విరంచ్ ప్రథమస్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులతో పాటు అకడమిక్ ఫెసిలిటేటర్ ఎస్.హేమలత, కోచ్‌లు ఎ.రవికుమార్, లక్ష్మీప్రసన్నకు అభినందనలు తెలియజేశారు.

ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి



పట్నంబజారు: ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు మౌలిక వసతులు కల్పించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా ఆదేశాల మేరకు సోమవారం 12వ డివిజన్‌లోని చిన్నబజారు, నూకాలమ్మ ఆలయం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. స్థానికంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైడు కాలువలు లీకై ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు ఆమె దృష్టికి తెచ్చారు. స్థానికుల సమస్యలు తెలుసుకున్న నూరి ఫాతిమా త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు సలీం, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రగతిలో నిమగ్నమవ్వాలి

చేబ్రోలు: దేశ ప్రగతికి దోహదపడే వినూత్న కార్యక్రమాలలో పరిశోధకులు నిమగ్నమవ్వాలని హైదరాబాద్‌లోని ఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ కే భానుప్రకాష్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో హ్యాండ్స్ ఆన్ ట్రెనింగ్ యూజింగ్ ఇన్-సిలికో టూల్స్ ఫర్ కెమికల్/బయోలాజికల్ అప్లికేషన్స్ అనే అంశంపై మూడు రోజుల వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. కాన్పూర్ ప్రొఫెసర్ డీఎల్‌వీకే ప్రసాద్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్.అగ్రహారం కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో గజలక్ష్మీ దేవిగా..



గంటలమ్మ చెట్టు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో రాజరాజేశ్వరి దేవిగా..



సంపత్ నగర్ శారదా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో హంస వాహన అలంకారంలో..

మాం పాహి సర్వేశ్వరి

■ ఆర్.అగ్రహారంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శ్రీ గజలక్ష్మి దేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు టీఎల్వీ వీరాంజనేయులు, నేరెళ్ల వెంకట హరి ప్రసాద్ రావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

■ గంటలమ్మ చెట్టు వీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆలయ అధ్యక్షులు కొత్తూరి వెంకట నరసింహారావు ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారు రాజ రాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

■ విద్యానగర్‌లో సాయినాథ సన్నిధానంలో అమ్మవారు గాయత్రీ దేవి రూపంలో దర్శనమిచ్చారు. భక్తుల విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

■ సంపత్‌నగర్‌లోని శారదా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆలయ గౌరవ ప్రతినిధి పోలిశెట్టి శ్రీహరి ప్రసాద రావు ఆధ్వర్యంలో నవ రాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారు హంస వాహిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

■ బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గాయత్రీ దేవిగా అమ్మవారు భక్తులను కనువిందు చేశారు.

■ ఏటి అగ్రహారంలోని గాయత్రీ మందిరంలో అమ్మవారు గజలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. – పాతగుంటూరు



ఆర్.అగ్రహారం గీతామందిరంలో అన్నపూర్ణదేవిగా

తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి

● జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్
● నందడిగా వైద్య కళాశాల ఫ్రెషర్స్ డే

గుంటూరు మెడికల్: వైద్య విద్యార్థులు తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని, వైద్య వృత్తి మానవ సంబంధాలకు దగ్గరగా ఉంటుందని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో సోమవారం జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకలు జరిగాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడే వైద్య వృత్తిని విద్యార్థులు ఎంపిక చేసుకోవడం అదృష్టమన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తల్లిదండ్రులకు అధ్యాపకులతో పంచుకుని వత్తిడిని అధిగమించాలని, వైద్యానికి ఎంతో డిమాండ్ ఉందని, ప్రజలు వైద్యుడిని దేవుడితో సమానంగా కొలుస్తారన్నారు. మానవత్వంతో రోగులకు వైద్యం అందించాలన్నారు. వైద్య వృత్తిని ఎంచుకున్న పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. అందుకు అవసరమైన వసతులు వైద్య కళాశాలలో ఉన్నాయన్నారు.

యాప్రాన్ ధరించండి

వైద్య వత్తిలో ఉన్నప్పుడు బాధ్యతగా యాప్రాన్ ధరించాలని డాక్టర్ కిరణ్‌కుమార్ చెప్పారు. యాప్రాన్ ధరించడం వల్ల వృత్తిపై గౌరవం పెరుగుతుందన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి మాట్లాడుతూ గుంటూరు మెడికల్ కళాశాలకు ఎంతో ఘన చరిత్ర ఉందన్నారు. వైద్య కళాశాలలో చదివిన వైద్య విద్యార్థులు దేశ విదేశాల్లో స్థిరపడి కళాశాల అభివృద్ధి కోసం కృషి చేసి మానవతా మూర్తులుగా నిలిచి పోయారని చెప్పారు. కళాశాలల్లో చదువుతున్నందుకు అందరూ గర్వపడాలన్నారు. ప్రస్తుత వైద్య విద్యార్థులు చదువుకున్న సంస్థకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. ర్యాగింగ్ మహా పెనుభూతం లాంటిదని, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. ఒకప్పుడు వైద్య కళాశాలలో 50 మెడికల్ సీట్లు ఉంటే నేడు 250 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయన్నారు. వైద్య వృత్తిలోకి ప్రవేశిస్తున్న వైద్య విద్యార్థులతో ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహూతులను అలరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభాకర రావు, డాక్టర్ శ్రీధర్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, జింకాన కో ఆర్డినేటర్స్ డాక్టర్ బాల భాస్కర రావు, డాక్టర్ హనుమంత రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్ కుమార్

జీజీహెచ్ ఫిజియోథెరపీ విరాళం

గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం ఫిజియోథెరపీ విభాగానికి సిమ్స్ కళాశాల ప్రిన్సిపల్, కార్యదర్శి డాక్టర్ శివశిరీష అందజేసిన రూ. 2 లక్షలు ఖరీదు చేసే వైద్య పరికరాలను డాక్టర్ కిరణ్‌కుమార్ ప్రారంభించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఫిజియోథెరపీ విభాగానికి వచ్చే రోగులను ఆప్యాయంగా పలకరించి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. సిమ్స్ కళాశాల ఇచ్చిన పరికరాలు రోగులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రమణ యశస్వి, డాక్టర్ సతీష్ కుమార్, ఈశ్వర్ రెడ్డి, సుశీల పాల్గొన్నారు.

పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు



పట్నంబజారు: పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వరం లాంటిదని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు చెప్పారు. సోమవారం 57వ డివిజన్ పరిధిలోని మంగళదాస్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్, 53వ డివిజన్ శారదా కాలనీ ఆర్పీ సెంటర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పేద ప్రజలకు అనారోగ్య సమస్యలు పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. నేరుగా వైద్యులతో సంప్రదింపులు జరిపి అనారోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించి వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నూరిఫాతిమా మాట్లాడుతూ పేద ప్రజల ఇంటి వద్దకే వైద్యం అందిస్తున్న ఘనత సీఎం వై.ఎస్.జగన్‌కే దక్కుతోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ధూపాటి వంశీ, పఠాన్ రిహానా, వైఎస్సార్‌సీపీ నేతలు పఠాన్ నూర్ ఖాన్, అగ్గిపెట్టి రాజు, సాల్మాన్, రాజేష్, పి.నాగేశ్వరరావు, మహేష్ పాల్గొన్నారు.

770 గ్రాముల శిశువును బతికించారు



గుంటూరు మెడికల్: ఆరున్నర నెలలకే ప్రసవమై 770 గ్రాముల బరువు ఉన్న ఆడ శిశువును అత్యాధునిక వైద్య పరికరాలతో మెరుగైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడినట్లు నియోటాలజిస్ట్ డాక్టర్ దేవభక్తుని రాకేష్‌బాబు చెప్పారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లాలోని తెనాలికి చెందిన మమత గర్భం దాల్చిన ఆరున్నరనెలలకే ప్రసవం జరిగి ఆగస్టు 5న శిశువుతో తమ ఆస్పత్రికి వచ్చిందని చెప్పారు. అత్యాధునిక వైద్య పరికరాలతో 70 రోజుల పాటు చికిత్స అందించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పసికందు బరువు 1500 గ్రాములకు చేరిందన్నారు. సోమవారం డిశ్చార్జి చేసినట్లు డాక్టర్ ప్రియాంక వెల్లడించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

నెహ్రూనగర్: ఉద్యోగుల సమస్యలపై అందే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి డిప్యూటీ కమిషనర్లను, విభాగాధిపతులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో ఎంప్లాయిస్ గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన వివిధ విభాగాల ఉద్యోగులకు సంబంధించిన సర్వీస్ సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెల 3వ సోమవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. గ్రీవెన్స్‌లో ఆయా విభాగాధిపతులు, డిప్యూటీ కమిషనర్లు పాల్గొంటారని, నగరపాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయ కార్యదర్శులు, మినిస్టీరియల్ సిబ్బంది, ఆయా విభాగ ఉద్యోగులు తమవిధి నిర్వహణలో ఎదురవుతున్న, సర్వీస్‌కి సంబంధించిన సమస్యలపై అర్జీలు అందించవచ్చన్నారు.

ఉద్యోగులు తమ సమస్యలపై అందించే అర్జీలను ప్రత్యేకంగా రిజిస్టర్‌లో నమో దు చేయాలని, వచ్చే నెలలో జరిగే గ్రీవెన్స్ నాటికి ప్రస్తుతం అందిన అర్జీల పరిష్కార వివరాల రిపోర్ట్‌తో హాజరు కావాలని మేనేజర్‌ని ఆదేశించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ చర్యలు తీసుకున్న సిబ్బందిపై అధికారుల విచారణ నివేదికలతో డిప్యూటీ కమిషనర్ వచ్చే చర్చించాలని ఆదేశించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఉద్యోగుల సమస్యలపై స్పెషల్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్న కమిషనర్‌ని ఎన్‌జీఓ అసోసియేషన్ నాయకులు శ్రీనివాస్, సతీష్ కుమార్‌లు కలిసి ఉద్యోగుల పక్షాన హర్షం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ భాను ప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, వివిధ విభాగాల సూపరిండెంటెంట్లు పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటాం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు.



ఉద్యోగుల సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ కీర్తి చేకూరి

ఇటీవల మరణించిన ఇంజినీరింగ్ విభాగ కార్మికుడు తాదిబోయిన గంగాధర రావు కుటుంబ సభ్యుల కు ఎక్స్ గ్రేషియా చెక్‌ను సోమవారం కమిషనర్ చాంబర్‌లో అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు నగరపాలక సంస్థ అండగా ఉంటుందన్నారు.

ఇంజినీరింగ్ విభాగంలో అవుట్ సోర్సింగ్ విధానంలో హెడ్ వాటర్ వర్క్స్‌లో విధులు నిర్వహించే తాదిబోయిన గంగాధర రావు ఇటీవల కాలంలో అనారోగ్యం వలన మరణించారని ఆయన భార్య శివపార్వతికి ఎక్స్‌గ్రేషియా రూ.2 లక్షల చెక్‌ని అందించామన్నారు. అదే విధంగా నగరపాలక సంస్థ నుంచి అందాల్సిన పరిహారాలు, పీఎఫ్ త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాధిపతులను, సూపరింటెండెంట్లను ఆదేశించారు. కార్మికులు కూడా తమ సమస్యలపై అర్జీలు లేదా ఫిర్యాదులు తమకు అందిచవచ్చని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు

గుంటూరు మెడికల్: కార్పొరేట్ వైద్యాన్ని పేదలకు అందించాలనే లక్ష్యంతో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని హోప్‌విన్ హాస్పిటల్ ఫౌండర్, సీనియర్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్ చెప్పారు. హోప్‌విన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నూతనంగా మహిళలకు సంబంధించి మనోపాజ్ క్లీనిక్‌ను జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ ఐదేళ్లుగా గుంటూరు నగరంలో మహిళలకు సంబంధించి ప్రత్యేక క్లీనిక్ నిర్వహిస్తూ ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న హోప్ విన్ హాస్పటల్స్ వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ ప్రకాష్, డాక్టర్ ఖాజా, డాక్టర్ రాహులాల్ రెడ్డి పాల్గొన్నారు.



మోనోపాజ్ అవగాహన పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ నీలం ప్రభావతి

సకల వేదాల సారం గాయత్రీ స్వరూపం



గీతా మందిరంలో కార్యాలయాన్ని, ప్రారంభిస్తున్న విప్ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరి, నూరి ఫాతిమా

శాసనమండలి విప్ లేళ్ళ అప్పిరెడ్డి

పట్నంబజారు: సకల వేదాల సారం గాయత్రీదేవి స్వరూపం అని శాసనమండలి ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి చెప్పారు. నూతనంగా ఆధునీకరించి భక్త సమాజానికి అందుబాటులోకి తెచ్చిన గీతామందిరం నూతన కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. గీతామందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా గీతా మందిరంలో గాయత్రీదేవి అలంకారంలో కొలువుదీరిన అమ్మవారికి వారు విశిష్ట పూజలు నిర్వహించారు. ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే విజయదశమి రోజుల్లో గీతామందిరం నూతన కార్యాలయం ప్రారంభించుకోవడం శుభ పరిణామమన్నారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ గాయత్రీ ఉపాసన వల్ల బుద్ధి తేజోవంతం అవుతుందని.. గాయత్రీ మంత్రజపం చతుర్వేదం పారాయణ ఫలితాన్ని ఇస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ గీతామందిరాన్ని ఆధునీకరించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకునివచ్చిన పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, గీతామందిరం కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), నిమ్మల వెంకట రమణ, రవి, అజయ్, టీఎల్‌వీ వీరాంజనేయులు, పరిశపోగు శ్రీనివాస రావు, పానుగంటి చైతన్య, తాడేపల్లి కృష్ణ, చుండూరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రీ ఓపెన్ అర్జీలు విభాగాధిపతులే పరిశీలించాలి

ఇన్‌చార్జ్ అదనపు కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్

నెహ్రూనగర్: ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీలు రీ ఓపెన్ అయితే విభాగాధిపతే నేరుగా పరిశీలించాలని ఇన్‌చార్జ్ అదనపు కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు ఆయన స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికై ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫోటోలు జత చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారీగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు. స్పందనలో 46, 42 డివిజన్ల కార్పొరేటర్లు బాలాజీ, శ్రీ రాంప్రసాద్‌లు తాగునీటి సరఫరాపై ఫిర్యాదు చేస్తూ, టిడ్కో ఇళ్లకు నీరివ్వడం వల్ల నగరాలు ప్రాంతానికి సరిపడా తాగునీరు అందడంలేదని, గతంలో కంటే కూడా సరఫరా బాగా తక్కువగా ఉందని తెలుపగా, స్పందించిన నగర కమిషనర్ వెంటనే ఇంజినీరింగ్ అధికారులు నగరాలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాని క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. టెండర్ వర్క్ అగ్రిమెంట్ పొంది పనులు చేపట్టని కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వాలని ఎస్‌ఈని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 38 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 5, ఇంజినీరింగ్ విభాగానికి 23, రెవెన్యూ విభాగానికి 3, ప్రజారోగ్య విభాగానికి 4, ఉపాసెల్ విభాగానికి 1, పరిపాలన విభాగానికి 2 చొప్పున ఫిర్యాదులు అందాయని, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్‌ఈ భాస్కర్, డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ శ్రీనివాస్

ఘనంగా బోనబోయిన జన్మదిన వేడుకలు

కొరిటిపాడు(గుంటూరు): ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలను బ్రాడీపేటలోని బ్యాంక్ ఆవరణలో సోమవారం ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ అర్బన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి బ్యాంక్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయన ఆయురారోగ్యాలతో మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకోవాలని, భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో బ్యాంక్ వైస్ చైర్మన్ మర్రెడ్డి బసివిరెడ్డి, పాలకవర్గ సభ్యులు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, అర్తిమళ్ళ వెంకటరత్నం, జి.శివరామకృష్ణ ప్రసాద్, కాకాని రామారావు, టి.కేశవయ్య, బి.రవీంద్రనాథ్, ఆర్.అనురాధ, ఈరేశం నరేంద్రబాబు, షేక్ సైదా, ఎస్.వెంకటేశ్వర్లు, ఆర్.భాస్కరరావు, గోవిందరాజు, బ్యాంక్ సీఈఓ ఎస్.సంజీవరావు, ఉద్యోగులు, సిబ్బంది, పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్

వైద్యం కోసం ఆర్థిక సహాయం

గుంటూరు మెడికల్: కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్న తొమ్మిది సంవత్సరాల బాలుడికి దాతల ఆర్థిక సహాయంతో రూ.4 లక్షలు చికిత్స కోసం గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అందజేశారు. మంగళగిరి మండలం పెదవడ్లపుడికి చెందిన శృంగారపు అనీల, విజయ్ కుమార్ దంపతుల తొమ్మిది సంవత్సరాల అభినయ్‌కు ఆరోగ్యం సరిగా లేక గుంటూరు లోని బ్లూమ్స్ హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం చేర్పించారు. వైద్యులు పరీక్షించి కిడ్నీ పనిచేయడం లేదని తల్లిదండ్రులకు చెప్పారు. నిరుపేదలైన అనిల దంపతుల చికిత్స చేయించేందుకు డబ్బులేక ఎదురు చూస్తున్న సమయంలో గుంటూరు కోవిడ్‌ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్‌కు సమాచారం ఇచ్చారు. స్పందించిన గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు స్పందించి బాబు తల్లిదండ్రులకు రూ. 4 లక్షలు అందజేసి ట్రస్టు దాతృత్వాన్ని చాటుకున్నారు. సహాయం కోసం 8143222456- 9397602553 నంబర్లకు సంప్రదించాలని గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు వెల్లడించారు.



అభినయ్ కుటుంబ సభ్యులకు రూ. 4 లక్షల నగదు అందజేస్తున్న ట్రస్టు సభ్యురాలు